జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 5 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 5

## సీతారామ ప్రాజెక్ట్ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యేలు



**ఇల్లందు, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)** ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగు, త్రాగు నీరుకు చీమలపాడు గ్రామ గ్రామ సరిహద్దుల్లో పాపకొల్లు గండ్ల వద్ద సీతారామ ప్రాజెక్టు నీళ్లను లిఫ్ట్ చేసేందుకు ఏర్పాటు చేసే పంపింగ్ లిఫ్ట్ చేసే ప్రాంతాన్ని ఆదివారం కాలినడకన వెళ్ళి స్థలాన్ని, మ్యాప్ ను ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మురళీ నాయక్ లు పరిశీలించారు. సీతారామ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ఉప ముఖ్యమంత్రి భట్టి,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి

మిగతా 2 లో...



- ఏళ్లపాటు కష్టించిన కౌలు రైతు పంటను కోసుకెళ్లింది ఎవరు..?
- రైతుకష్టాన్ని.. కాసులుగా మార్చుకుంది ఎవరు..?
- ఫిర్యాదులు వరుసగా ఉన్నా.. కేసు నమోదు చేయని లక్ష్మీదేవిపల్లి పోలీసులు
- రెవెన్యూ శాఖ ఆపాలని చెప్పినా నరికివేతను అడ్డుకోలేదేం..?
- రౌడీషీటర్లు, రాజకీయ నేతల అండతోనే ఇంతటి దౌర్జన్యమా..?
- జిల్లా కేంద్రం పరిసరాల్లోనే చోద్యం చూస్తున్న అధికారులు మౌనం దేనికి సంకేతం..?



## రూ.70 లక్షల పంట దోపిడీలో..
# ఎవరి వాటా ఎంత..?

ఆరుగాలం కష్టించి పండించిన పంట.. చేతికొచ్చే సమయంలో దౌర్జన్యంగా దోపిడీకి గురైతే ఆ రైతు పరిస్థితి ఎలా ఉంటుంది..? లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఏళ్ల తరబడి పెంచిన జామాయిల్ తోటను కొందరు బలవంతంగా నరికివేసి సొమ్ము చేసుకుంటే ఆ కౌలు రైతు గుండెకోతను మాటల్లో చెప్పగలమా..? లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల రెవెన్యూ పరిధిలోని మున్యతండా గ్రామం సర్వే నంబర్లు 14, 14/అ పరిధిలో చోటుచేసుకున్న జామాయిల్ పంట నరికివేత వ్యవహారం ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలతోనే జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది.

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

## సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు పూర్తవుతుందా..? లేదా..?



- ఏప్రిల్‌లో కంకర పోసి వదిలేసిన వైనం
- దుమ్ము, గుంతలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజల ఎదురుచూపు

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 4, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ నెలలో రహదారిపై కంకర పోసి వదిలేయడంతో అప్పటి నుంచి రహదారి సమస్యగా మారింది. మధ్యలో డివైడర్ నిర్మాణం చేపట్టినా, మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.కంకర రోడ్డుపై వాహనాల రాకపోకలతో నిత్యం దుమ్ము లేస్తుండగా, పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు

మిగతా 2 లో...

## 16 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడి అత్యాచార యత్నం

- బస్సు కోసం వేచి ఉన్న బాలికను ఇంటి వద్ద దింపుతానంటూ బైక్‌పై ఎక్కించుకున్న వృద్ధుడు
- దారిలో లైంగిక దాడికి యత్నం



2 లో...

## చికెన్ షాపులపై కమిషనర్ కొరడా

- ఆకస్మిక తనిఖీలతో షాపుల యజమానుల్లో కలవరం
- పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశం
- వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన చికెన్ అందించాలని సూచన




**ఇల్లందు, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని చికెన్ షాపుల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా మున్సిపల్ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ సందీప్ పట్టణంలోని పలు చికెన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల పరిసరాలు, చికెన్ నిల్వ చేసే విధానం, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

చికెన్ షాపుల్లో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని కమిషనర్ షాపుల నిర్వాహకులకు స్పష్టం చేశారు. మాంసాన్ని విక్రయించే ప్రాంతాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. షాపు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు, వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా

మిగతా 2 లో...

## చికెన్ షాపులపై కమిషనర్ కొరడా

(మొదటి పేజీ తరువాయి...)

తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు**

చికెన్ షాపుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను షాపుల వద్దే నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు తరలించాలని కమిషనర్ సూచించారు. వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు, ఇతర కీటకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాల్లో వ్యర్థాలు కనిపిస్తే సంబంధిత షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నాణ్యత విషయంలో రాజీ వద్దు**

వినియోగదారులకు పరిశుభ్రమైన, నాణ్యమైన చికెన్‌ను మాత్రమే అందించాలని కమిషనర్ ఆదేశించారు. మాంసం నిల్వ, విక్రయ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో షాపుల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

చికెన్ షాపుల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. చికెన్ షాపుల నిర్వాహకులు అధికారుల సూచనలను పాటిస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యర్థాలను సక్రమంగా తరలిస్తూ ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందించాలని కమిషనర్ సూచించారు.

## సీతారామ ప్రాజెక్ట్ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యేలు

(మొదటి పేజీ తరువాయి...)

కెసిఆర్ ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాలకు సాగు నీరు అందించకుండా విస్మరించారన్నారు. ఇల్లందు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని 2014లో పార్టీలోనికి చేర్చుకోని పైలాన్ అవిష్కరించి మా ప్రాంతాన్ని ఎడారిగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యం లోని ప్రజా ప్రభుత్వంలో ఇల్లందు ప్రాంతాన్నికి సీతారామ జలాలు తీసుకువస్తామని స్పష్టం చేశారు. త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పనులు, పనులు ప్రారంభిస్తామని ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంత ప్రజల కలను నిజం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమలపాడు సర్పంచ్ మాళోత్ లలిత బావుసింగ్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్, నాయకులు మధుకర్ రెడ్డి, తోటకూరి శీవయ్య, గబ్రు నాయక్, వెల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు పూర్తవుతుందా..? లేదా..?

(మొదటి పేజీ తరువాయి...)

పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంట ఉన్న వ్యాపారులు, నివాసితులు దుమ్ము కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల గురించి అధికారులను ప్రజలు ప్రశ్నించిన ప్రతిసారీ ఈ వారంలోనే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారే తప్ప, పనులు మాత్రం ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా రహదారి పనులు పూర్తికాకపోవడంతో సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు పూర్తవుతుందా..? లేదా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి రహదారి పనులను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. దుమ్ము, గుంతల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## 16 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడి అత్యాచార యత్నం

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 4 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్‌లో 16 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తన ఇంటి సమీపంలో నివసించే బాలికపై కన్నేసిన రాయల కోటయ్య (60) ఆమెను ఒంటరిగా ఉన్న సమయంలో అడ్డగించి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న బాలిక రామచంద్రాపురం బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా.. అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న కోటయ్య ఆమెను గమనించాడు. ఇంటి వద్ద దింపుతానని చెప్పి బాలికను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత బైక్‌ను ఆపి బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే బాలిక అతని నుంచి తప్పించుకుని అక్కడి నుంచి బయటపడింది

- ఏళ్లపాటు కష్టించిన కౌలు రైతు పంటను కోసుకెళ్లింది ఎవరు..?
- రైతుకష్టాన్ని.. కాసులుగా మార్చుకుంది ఎవరు..?
- ఫిర్యాదులు వరుసగా ఉన్నా.. కేసు నమోదు చేయని లక్ష్మీదేవిపల్లి పోలీసులు
- రెవెన్యూ శాఖ ఆపాలని చెప్పినా నరికివేతను అడ్డుకోలేదేం..?
- రౌడీషీటర్లు, రాజకీయ నేతల అండతోనే ఇంతటి దౌర్జన్యమా..?
- జిల్లా కేంద్రం పరిసరాల్లోనే చోద్యం చూస్తున్న అధికారుల మౌనం దేనికి సంకేతం..?



# రూ.70 లక్షల పంట దోపిడీలో..
# ఎవరి వాటా ఎంత..?

**ఆరుగాలం కష్టించి పండించిన పంట.. చేతికొచ్చే సమయంలో దౌర్జన్యంగా దోపిడీకి గురైతే ఆ రైతు పరిస్థితి ఎలా ఉంటుంది..? లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఏళ్ల తరబడి పెంచిన జామాయిల్ తోటను కొందరు బలవంతంగా నరికివేసి సొమ్ము చేసుకుంటే ఆ కౌలు రైతు గుండెకోతను మాటల్లో చెప్పగలమా..? లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల రెవెన్యూ పరిధిలోని మున్యతండా గ్రామం సర్వే నంబర్లు 14, 14/ర పరిధిలో చోటుచేసుకున్న జామాయిల్ పంట నరికివేత వ్యవహారం ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలతోనే జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

**పోలీసుల వైఖరిపై బహుళ అనుమానాలు!**

ఈ వ్యవహారంలో బాధితుడైన కౌలు రైతు అజ్మీరా మురళి 2014 నుంచి సదరు భూమిని లీజుకు తీసుకుని జామాయిల్ సాగు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి విచారణలో స్పష్టంగా తేలింది. ప్రస్తుతం సుమారు 60 ఎకరాల్లో ఏపుగా పెరిగిన ఈ పంట విలువ మార్కెట్ లో రూ.70 లక్షల వరకు ఉంటుంది. అయితే, కొందరు స్థానిక నేతలు తమకున్న బలంతో ఈ తోటను అక్రమంగా నరికివేసి, కలపను వాహనాల్లో తరలించి విక్రయించుకున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అయితే దీనిపై కౌలు రైతు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఈ కేసును అసలు పట్టించుకోలేదని తెలుస్తోంది. అయితే గతంలో ఇదే భూమికి సంబంధించి పంట నరికివేత జరిగినప్పుడు, నష్టం చాలా తక్కువగా ఉన్నప్పటికీ లక్ష్మీదేవిపల్లి పోలీసులు వెంటనే స్పందించి కేసులు నమోదు చేశారు. కానీ, ఈసారి ఏకంగా రూ.70 లక్షల విలువైన పంటను కళ్లెదుటే దోచుకెళ్లారని కౌలు రైతు మురళి జూలై 20, జూలై 28 తేదీల్లో స్టేషన్ మెట్లు ఎక్కి పదేపదే పోలీసులకు ఫిర్యాదులు చేసినా వారు కనీసం పట్టించుకోలేదు. చివరికి జిల్లా ఎస్పీ, డీఎస్పీ, ఎస్ హెచ్ ఓలను టాగ్ చేస్తూ ఆన్ లైన్ లో ఫిర్యాదులు చేసినా లక్ష్మీదేవిపల్లి పోలీసులు ఇప్పటి వరకు ఎఫ్ ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.కనీసం పంటను ఎవరు నరికారు, కలపను ఏ వాహనాల్లో ఎక్కడికి తరలించి అమ్మేశారు అనే ప్రాథమిక విషయాలపై కూడా విచారణ జరపకుండా పోలీసులు మౌనం వహించారని తెలుస్తోంది. దీంతో పాటు ఈ వ్యవహారంలో స్థానిక సీఐ ఈ కేసును దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు కూడా కౌలు రైతు వర్గం నుంచి వస్తున్నాయి. దీంతో సామాన్య రైతుకు న్యాయం చేయాల్సిన పోలీసులే ఇలా వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటన్నది అధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.

**మారిన తహసీల్దార్ వైఖరి..?**

### కౌలు రైతుపైనే పోలీసుల ఆంక్షలు..!

ఇక చివరికి ఈ విషయంలో భూమి యాజమాన్యంపై వివాదం ఉందని అధికారులు సాకు చెబుతున్న నేపథ్యంలో.. గత 12 ఏళ్లుగా ఈ రైతు కౌలు చేసుకుంటున్నా ఎన్నడూ లేని ఈ వివాదం ఇప్పుడే వస్తే దాన్ని రెవెన్యూ లేదా న్యాయస్థానాలు తేల్చుకోవాలి. కానీ, ఏళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేసిన రైతు, తాను పండించిన పంటను అన్యాయంగా కోసుకెళ్తుంటే చూస్తూ ఊరుకోవాలా అనే వాదన వ్యక్తమవుతోంది. దానికి తోడు, పంటను కాపాడుకునేందుకు పొలంలోకి వెళ్తే కౌలు రైతు మురళినే బెదిరిస్తూ "పొలంలోకి వెళ్తే నీపై పీడీ యాక్ట్ కేసు వేస్తాం" అంటూ పోలీసులు హెచ్చరించారనే ఆరోపణలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. రెక్కలకష్టం నమ్ముకున్న కౌలు రైతుపై ఇలాంటి ఆంక్షలు విధించడం ఏ చట్టానికి సంకేతం? జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఒక కౌలు రైతు కష్టించి పెంచిన రూ. 70 లక్షల పంట దౌర్జన్యంగా నరికివేతకు గురవుతున్నా.. వరుస ఫిర్యాదులు అందుతున్నా.. ఆన్ లైన్ లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్వయంగా ఎమ్మార్వో వారించినా.. సంబంధిత అధికారులు మౌనం వహించడం దేనికి సంకేతం? పంటను అక్రమంగా నరికి అమ్ముకున్న సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లింది? ఈ రూ. 70 లక్షల దోపిడీలో ఎవరెవరి వాటాలు ఎంత? ఈ ప్రశ్నలన్నింటికీ ఉన్నతాధికారులు నిష్పాక్షిక విచారణ జరిపి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, రూ. 70 లక్షల పంట దోపిడీకి పాల్పడిన అసలు దోషులను, వారికి సహకరించిన రాజకీయ, అధికార యంత్రాంగాన్ని బయట పెట్టి కౌలు రైతుకు న్యాయం చేయాలని బాధితుడు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అయితే ఈ వ్యవహారంలో రెవెన్యూ శాఖ పాత్ర అత్యంత కీలకంగా మారింది. ఫిర్యాదు అందిన వెంటనే భూమిని సర్వే చేయించి రికార్డు నమోదు చేశామని లక్ష్మీదేవిపల్లి ఎమ్మార్వో శిరీష స్పష్టం చేశారు. తమ ఎంక్వయిరీలో మురళి కౌలుదారుడిగా ఉన్నట్లు తేలిందని, 1960 నుంచి సదరు భూమి ఒకే పట్టాదారు పేరుతో రికార్డుల్లో నమోదై ఉందని వెల్లడించారు అయితే, సదరు నివేదిక వచ్చిన కొంతకాలానికి మరికొందరు భూమిపై హక్కులు కోరుతూ కొత్తగా ఫిర్యాదులు చేశారని ఎమ్మార్వో తెలిపారు. దీంతో ఇక్కడే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదట విచారణ జరిపి నివేదిక ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. కొత్త వ్యక్తుల ఫిర్యాదుల రాకతో తమ వైఖరి మార్చుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటి..? అన్నది అంతు చిక్కడం లేదు. అయితే ఆ కొత్త ఫిర్యాదుదారుల వద్ద ఉన్న ఆధారాలేమిటి? వాటిని అధికారులు ఏ ప్రాతిపదికన పరిశీలించారు? అన్నది తేలాల్సి ఉంది. మరో వైపు, "పంట నరికివేతను ఆపాలని పోలీసులకు సూచించాం" అని ఎమ్మార్వో శిరీష స్వయంగా వెల్లడించినప్పటికీ, పోలీసులు ఆ నరికివేతను అడ్డుకోకపోవడం వారి పాత్రపై మరిన్ని సందేహాలకు తావిస్తోంది.

**రౌడీషీటర్ల అంగబలం.. రాజకీయ నేతల అండ!**

అసలు ఈ పంట నరికివేత వ్యవహారంలో రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందనే ఆరోపణలు స్థానికంగా గుప్పుమంటున్నాయి. ఈ తోటను నరికివేసే సమయంలో కొందరు రౌడీషీటర్లుగా గుర్తింపు ఉన్న వ్యక్తులను అక్కడికి తీసుకొచ్చి అంగబలంగా నిలబెట్టారని సమాచారం. స్థానిక రాజకీయ నేతల అండదండలు, ఆర్థిక సహకారం ఉండటంతోనే అక్రమార్కులు ఇంత తెగించి పంటను నరికి తరలించగలిగారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో అసలు ఈ దౌర్జన్యానికి వెన్నుదన్నుగా నిలిచింది ఎవరు? ఆర్థికంగా, రాజకీయంగా సహకరించిన ఆ అదృశ్య హస్తాలు ఎవరివి? అనే విషయాలపై పోలీసులు నిష్పాక్షిక దర్యాప్తు జరపాల్సి ఉంది.

# మణుగూరు ఆర్టీసీలో కూటమి హవా...!





- ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో త్రిముఖ కూటమి
- ప్రధాన సంఘాలుగా ఎస్ డబ్ల్యూ ఎఫ్, టీ ఎమ్ యూ, ఐఎన్టీయూసీ
- కూటమి గెలుపే లక్ష్యంగా అధికార వ్యూహం
- క్యాంపు ఆఫీస్ లో ఆర్టీసీ నేతలతో మంతనాలు...! 241 ఓట్లపై కన్ను
- కార్మిక సంక్షేమమే అజెండా.. ఆర్టీసీ సంఘాలకు ఎమ్మెల్యే పాయం దిశానిర్దేశం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. అక్టోబర్ 4, ప్రజాజ్యోతి

ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు ఈ నెల 9న జరిగే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మణుగూరు డిపోలో మూడు ప్రధాన సంఘాలు ఎస్ డబ్ల్యూ ఎఫ్, టీ ఎమ్ యూ, ఐఎన్టీయూసీ కూటమిగా ఏర్పడ్డాయి. ఇందులో భాగంగా ఆదివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్టీసీ కూటమి నాయకులతో కీలకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్టీసీ ఎన్నికలు ఉద్దేశించి మాట్లాడుతూ మణుగూరు డిపో పరిధిలో 241 మంది ఓటర్లు ఉండగా, కూటమి గెలుపునకు చేపట్టాల్సిన ప్రచారం, సమన్వయం, కార్యాచరణపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే కార్మికులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ డిపో సెక్రటరీ చారీ, ఎస్ డబ్ల్యూఎఫ్, డిపో సెక్రటరీ బి.రాములు నాయక్, టీ ఎమ్ యూ నేత తాటి సుధాకర్, పీఎస్ రెడ్డి, ఆర్. ఎమ్ రెడ్డిలతో పాటు కూటమి నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 4,(ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటల లోపు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెంలో నీ ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# మిత్రధర్మం ఎక్కడా తప్పలేదు.. తప్పేది లేదు

- శ్రీనన్న ప్రజల మనిషి.. జన నాయకుడు: బోడ రమేష్



**కొత్తగూడెం, అక్టోబర్ 4(ప్రజాజ్యోతి)**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు 'మిత్రద్రోహం' వంటి పదాలతో విమర్శలు చేయడం రాజకీయ మర్యాద కాదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీ బోడ రమేష్ అన్నారు. మంత్రి పొంగులేటి రాజకీయాల్లో మిత్రధర్మాన్ని ఎక్కడా తప్పలేదని, ఇకముందు కూడా తప్పేది లేదని స్పష్టం చేశారు.ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం, సమస్యలతో తనను ఆశ్రయించే వారికి స్పందించడం, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ జీవితంలో భాగమని బోడ రమేష్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి గడప కూడా శ్రీనన్న తమ ప్రాంతానికి రావాలని, తమ సమస్యలు చెప్పుకోవాలని ఎదురుచూస్తోందన్నారు. "శ్రీనన్న అందరివాడు. కష్టం అంటే స్పందించే మనసున్న నాయకుడు. ప్రజలతో మమేకమై వారి కష్టాల్లో తోడుగా నిలిచే నాయకుడే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి" అని బోడ రమేష్ అన్నారు.ఒక ప్రజాప్రతినిధి ఏ ప్రాంతంలో పర్యటించాలి, ఎవరిని కలవాలి, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలి అనే విషయాలను ఎవరూ నిర్దేశించలేరని అన్నారు. ప్రజలతో మమేకమయ్యే హక్కు ప్రతి ప్రజాప్రతినిధికీ ఉందని పేర్కొన్నారు. కొత్తగూడెంలో రాజకీయంగా కలుగజేసుకోవద్దనే తరహా వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటాయని అన్నారు.పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై రాజకీయ విమర్శలు చేయాలనుకుంటే ప్రజా సమస్యలు, అభివృద్ధి, నిధులు, ప్రభుత్వ విధానాలపై ఆధారాలతో మాట్లాడాలని బోడ రమేష్ సూచించారు. వ్యక్తిగత పదజాలంతో విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. "మిత్రద్రోహం అనే పదాన్ని పదేపదే ఉపయోగించినంత మాత్రాన వాస్తవాలు మారవు. ఎవరు ఎవరికి అండగా నిలిచారో, ఎవరు ప్రజల కోసం పనిచేశారో ప్రజలకు తెలుసు. శ్రీనన్న మిత్రధర్మం ఎక్కడా తప్పలేదు.. తప్పేది లేదు. ఆయన ప్రజల మనిషి.. జన నాయకుడు" అని బోడ రమేష్ అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు తెలుసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవడం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడం కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.ప్రాంతీయ పరిమితులు, వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సమస్యలే రాజకీయాలకు కేంద్రబిందువుగా ఉండాలని బోడ రమేష్ సూచించారు. జిల్లా అభివృద్ధి కోసం అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

# శబరి నిలయానికి దాతల అండ



**చర్ల, అక్టోబర్ 04:(ప్రజా జ్యోతి):** వనవాసీ కళ్యాణ పరిషత్‌కు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన జితేంద్ర ట్రేడర్స్ యజమాని జితేంద్ర మహాజన్ తన కుమార్తె, దంత వైద్యురాలు డాక్టర్ యోగితా మహాజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని చర్లలో వనవాసీ ఆధ్వర్యంలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన శబరి బాలికా నిలయానికి వంట సామగ్రిని అందించారు. అలాగే కొమరం భీం, శబరి విద్యార్థి నిలయాల్లోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆశాలత మాట్లాడుతూ సుదూర ప్రాంతమైన ఖానాపూర్‌లో నివసిస్తున్న జితేంద్ర మహాజన్ చర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యార్థి నిలయం అవసరాలను గుర్తించి సహాయం అందించడం సంతోషకరమన్నారు. దాతల సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.వనవాసీ సంస్థలు ప్రధానంగా దాతల సహకారంతోనే కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. బాలికల విద్య కోసం తెలంగాణలోనే తొలి విద్యార్థి నిలయాన్ని చర్లలో ఏర్పాటు చేసినట్లు తెలుపుతూ దీనికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.విద్య ఉంటేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని, కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ఆశాలత అన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెచ్చించి పిల్లలను చదివిస్తున్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని, వారి శ్రమను వృథా చేయకుండా ఇష్టపడి చదివి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొమరం భీం విద్యార్థి నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి నిలయ కమిటీ సభ్యులు పోలిన రమాదేవి, గొప్ప విజయలక్ష్మి, బుటారి సుజాత, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి

- బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, అక్టోబర్ 04(ప్రజా జ్యోతి):** తెలంగాణలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో రైతులు మానసికంగా కుంగిపోతున్నారని చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. వెంటనే రైతులకు 24 గంటల విద్యుత్ అందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు, విద్యుత్‌పై ఆధారపడి జీవించే కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 24 గంటల విద్యుత్ సరఫరా చేసిందని దొడ్డి తాతారావు తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలిచిందన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.15 వేలు, కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందిస్తామని ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందని విమర్శించారు. గతంలో రైతులకు అందిన 24 గంటల విద్యుత్‌ను కూడా ప్రస్తుతం సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు తమ పంట పొలాలకు సకాలంలో నీరు అందించలేకపోతున్నారని తెలిపారు. గతంలో అవసరమైన సమయంలో పొలాలకు నీరు పెట్టుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.ఈ సందర్భంగా మొగళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు నేదూరి సత్యనారాయణను విద్యుత్ సమస్యలపై వివరణ కోరగా, విద్యుత్ కోతలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు విద్యుత్ సరఫరా ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు నిలిపివేస్తున్నారని, మధ్యలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీంతో రోజుకు రెండు ఎకరాల పంటకు కూడా పూర్తిస్థాయిలో నీరు అందించలేకపోతున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) కావాలని చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.విద్యుత్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గుతోందని దొడ్డి తాతారావు ఆరోపించారు. 130 కేవీ విద్యుత్ లైన్లు భద్రాచలం, వెంకటాపురం ప్రాంతాలకు దూరంగా ఉండటంతో కూడా కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే రైతులు పంటలు పండించుకోలేక, ప్రజలు తాగునీటి సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని, లేనిపక్షంలో రైతుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని దొడ్డి తాతారావు హెచ్చరించారు.

## తిప్పాపురంలో ఆటో కార్మికుల ధర్నా



**చర్ల, అక్టోబర్ 04: (ప్రజా జ్యోతి):** ఛత్తీస్ గఢ్ లోని పామేడు పోలీసులు తెలంగాణ నుంచి రాకపోకలు సాగించే ఆటో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆటో కార్మికులు చర్ల మండలం తిప్పాపురంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. తెలంగాణకు చెందిన ఆటోలను లక్ష్యంగా చేసుకుని రూ.1,000 నుంచి రూ.3,000 వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధిత కార్మికులు ఆరోపించారు.డబ్బులు ఇవ్వకపోతే వాహనాలను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఛత్తీస్ గఢ్ కు ప్రయాణించే వాహనాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతించాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై బీజాపూర్ జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు తెలంగాణ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే ఛత్తీస్ గఢ్ కు చెందిన వాహనాలను తెలంగాణలో అడ్డుకుని నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆటో కార్మికులు హెచ్చరించారు.

## ఇల్లందు మున్సిపాలిటీకి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయండి





**ఇల్లందు, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మున్సిపాలిటీకి రూ. 30 కోట్లు మంజూరు చేయాలని ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కోరారు. జీఓ నెం.76 అమలు చేయాలని, దసరాకు రూ.30 లక్షలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన అనంతరం ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని చైర్‌పర్సన్ కోరారు. ఈ హామీ మేరకు నిధులను ఇక ఆలస్యం చేయకుండా తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇల్లందు పట్టణంలో రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులకు నిధులు అత్యవసరంగా అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దసరా ఉత్సవాలకు రూ.30 లక్షలు తక్షణమే విడుదల చేయాలి. రేపు జరగనున్న దసరా ఉత్సవాలను ఇల్లందు పట్టణంలో ఘనంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ వద్ద తగినన్ని నిధులు లేని పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.30 లక్షలను తక్షణమే విడుదల చేసి, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి జాఫర్, సిహెచ్ శృతి రమేష్, సైదుమియా, కొర్లపాటి శివ కిరణ్, నాయకులు దొడ్డ డానియల్, సుదర్శన్ కోరి, పర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి రోడ్లకు మహర్దశ.. అశ్వారావుపేటలో అభివృద్ధి జోరు!

- **ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..**
- **పనుల పూర్తికి వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ప్రత్యేక చొరవ!**
- **ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలతో సీసీ రోడ్ల పనులకు వేగం**
- **బతుకమ్మకు ముందే అసంపూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించిన జారే**

**అశ్వారావుపేట, ప్రజా జ్యోతి అక్టోబర్** ప్రజల సమస్యలే ప్రథమ ప్రాధాన్యం.. అభివృద్ధి పనులే అసలైన ప్రజాసేవకు నిదర్శనం! అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మట్టి, గ్రావెల్ రోడ్ల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇస్తూ, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నారు.

**›› ప్రజల ఇబ్బందులపై వెంటనే స్పందన.. జూపల్లి రమేష్ బాబు చొరవతో పనుల వేగవంతం!**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపుగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే కాలనీ ప్రవేశ ద్వారం వద్ద సుమారు 20 మీటర్ల మేర రోడ్డు పనులు మిగిలి ఉండటాన్ని గుర్తించిన వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.కాలనీలో దాదాపు అన్ని రోడ్లు పూర్తయినా, ప్రవేశ ద్వారం వద్ద కొంత పని మిగిలి ఉంటే ప్రజలకు ఇబ్బంది తప్పదు. ఈ విషయాన్ని గుర్తించి అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే తన చొరవను జూపల్లి రమేష్ బాబు చాటుకున్నారు.

**›› బతుకమ్మ ఆడపడుచులకు ఇబ్బందులు వద్దు.. పండుగకు ముందే పనులు పూర్తి చేయాలి!**

20వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కనకదుర్గమ్మ తల్లి ఆలయం పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దసరా, బతుకమ్మ వేడుకల నేపథ్యంలో మహిళలు, ఆడపడుచులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మరోసారి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.నవరాత్రులు ప్రారంభమయ్యే మొదటి రోజు నాటికే మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పండుగల సమయంలో మహిళలు బతుకమ్మ ఆడేందుకు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.అభివృద్ధి పనులతో పాటు పండుగల వేళ ప్రజల సౌకర్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అనే విధంగా జూపల్లి రమేష్ బాబు తీసుకున్న చొరవ స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**›› మాటలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ!**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మట్టి, గ్రావెల్ రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మితమైతే కాలనీవాసులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. వర్షాకాలంలో ఎదురయ్యే రహదారి ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించడం.. అసంపూర్తి పనులపై అధికారులను అప్రమత్తం చేయడం.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం.. ఈ అంశాలకు ప్రాధాన్యత నిస్తూ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలకు అనుగుణంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలనే లక్ష్యంతో స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల యూత్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, 10వ వార్డు హ్యాట్రిక్ కౌన్సిలర్ మిండా హరిబాబు, 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.కె. నూర్జహాన్, విజయ్ కుమార్ రెడ్డి, కానూరి మోహన్ రావు, ఎస్.కె. సైదు బాజీ, దండ బత్తుల రమేష్, దోరేపల్లి కరుణాకర్, దాబా రాజు, దేరంగుల చంటి, కిషోర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



## ఆరోగ్య పరీక్షలకు తరలివచ్చిన స్థానికులు

- **400 మందికి ఉచిత వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ**



**బూర్గంపహాడ్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో సారపాక లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్, సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సారపాక పరిసర ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్ .పీ. సింగ్, కార్యదర్శి డేవిడ్ ఆలివర్ తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. పలు రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.శిబిరంలో సుమారు 400 మంది పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు అందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నడవడానికి ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు యాకూబ్ ప్రసాద్ వాకర్ ను అందించడం కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది. ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించడం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజా ఆరోగ్యానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఐటీసీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చారిత్రక సంపద పరిరక్షణకు కృషి చేస్తా

- **ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**





**ములకలపల్లి అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి ):** మండలంలోని నల్లముడి గ్రామంలో ఉన్న పురాతన పాండవుల గుట్టను . ఛత్తీస్ గఢ్ లోని దంతెవాడకు చెందిన సత్యనారాయణ కర్మ ఆధ్వర్యంలో వచ్చిన ప్రత్యేక బృందం సభ్యులతో కలిసి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం సందర్శించారు. పురాతన కట్టడాలు, ఆలయాలను పరిశీలించి వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాండవుల గుట్టకు విశిష్టమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందన్నారు. పురాతన కట్టడాలు, ఆలయాలను పరిరక్షించడంతో పాటు వాటి విశిష్టతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పాండవుల గుట్టకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో పురాతన కట్టడాలు, ఆలయాలను పరిరక్షించి భావి తరాలకు ఈ చారిత్రక సంపదను అందించేలా కృషి చేస్తానని జారె ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ జిల్లా నా యకులు బత్తుల అంజి, కారం సుదీర్ వెలకం వెంకటేష్, శివ, తదితరులు ఉన్నారు.

# ఎంపీఓ చొరవతో దారి సమస్యకు పరిష్కారం!

- ఆక్రమణలతో మూసుకుపోయిన దారిని తెరిపించిన అధికారులు
- పొట్లపల్లిలో ఏళ్ల నాటి సమస్యకు ఎట్టకేలకు మోక్షం
- బతుకమ్మకు పెద్దవాగుకు వెళ్లేందుకు గ్రామస్తులకు ఊరట
- రెండు రోజుల్లో గ్రావెల్, మట్టితో దారి అభివృద్ధికి హామీ







**పినపాక, అక్టోబర్ 4(ప్రజాజ్యోతి)** పినపాక మండలం పొట్లపల్లి గ్రామ పంచాయతీలో ఏళ్లుగా సమస్యగా మారిన దారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. దారికి ఇరువైపులా ఉన్న కొందరి ఇళ్లవారు ఆక్రమించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి, దారి క్రమంగా మూసుకుపోయింది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం దసరా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ మహిళలు బతుకమ్మ ఆడేందుకు ప్రతిరోజూ పెద్దవాగు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అయితే దారి ఆక్రమణలకు గురై మూసుకుపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో గ్రామస్తులు సర్పంచ్ సమ్మయ్యతో కలిసి సమస్యను ఎంపీఓ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు.

**»» స్పందించిన ఎంపీఓ**

గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన ఎంపీఓ వెంకటేశ్వరరావు శనివారం పొట్లపల్లి గ్రామానికి చేరుకుని సమస్యను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ఆక్రమణలను తొలగించి రాకపోకలకు వీలుగా దారిని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిదారిని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు గ్రావెల్, మట్టి పోసి చదును చేసి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎంపీఓకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోట్లపల్లి పంచాయతీ సర్పంచ్ సమ్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు

# ఆపదలో ఆదుకున్న రోటరీ క్లబ్

- బాలుడి వైద్య ఖర్చులకు రూ.20,116 ఆర్థిక సాయం




**భద్రాచలం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి భద్రాచలం రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన 12 ఏళ్ల సాయి రోహిత్ ఇటీవల వినాయక మండపం తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం చేయాలని అతని తల్లిదండ్రులు చేసిన విజ్ఞప్తిపై రోటరీ క్లబ్ సభ్యులు స్పందించారు.ఈ మేరకు ఆదివారం బాలుడి తల్లిదండ్రులకు రూ.20,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో రోటరీ క్లబ్ భద్రాచలం అధ్యక్షుడు షేక్ అజీమ్, కార్యదర్శి పాపినేని శ్రీనాథ్ రాజేష్, కోశాధికారి కె. రామకృష్ణ, రోటరియన్లు వీరయ్య బాబు, యశోద రాంబాబు, కటుకూరి ప్రభాకర్, గుప్తా రాజారెడ్డి, సుధాకర్ రెడ్డి, బాలాజీ, మధు, రఫీ, చలపతి, సాగర్, బందు నరసింహరావు, రాజశేఖర్, గ్లాడ్‌స్టోన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పితృపక్షాల్లో భద్రాద్రికి ఆధ్యాత్మిక శోభ

- గోదావరి మాతకు 21 సార్లు దివ్య హారతి
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు



**భద్రాచలం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** పితృపక్షాల సందర్భంగా పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తుల జైశ్రీరామ్ నామస్మరణ, పురోహితుల మంత్రోచ్చారణల నడుమ గోదావరి మాతకు దివ్య నదీహారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదావరి కరకట్ట వద్ద ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన భద్రాద్రి క్షేత్రంలో గోదావరి నదికి హారతి ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. దేశ, విదేశాల నుంచి భద్రాచలానికి వచ్చే భక్తులు నదీహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ముందుగా గోదావరి నదీహారతి విశేషాలను భక్తులకు వివరించి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం నిర్వహించారు. పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన చేపట్టారు. పురోహితుల శ్రీరామ అష్టోత్తర పఠనం మధ్య భక్తులతో 'ఓం శ్రీరామాయ నమః' అంటూ 108 సార్లు శ్రీరామ నామస్మరణ చేయించారు.అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామివారికి 12 సార్లు హారతి సమర్పించి, గోదావరి మాతకు 21 సార్లు దివ్య హారతి ఇచ్చారు. లోకకళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ నదీహారతి కార్యక్రమంలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందాలని రామవజ్జల రవికుమార్ కోరారు.తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాల్లో సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని గోదావరి మాతను ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతి మంత్ర పఠనం చేపట్టారు.రామవజ్జల రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు పంపిణీ చేశారు. నదీహారతి కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాద్రి పురోహితుల సంఘం సమకూర్చింది.కార్యక్రమంలో సత్య ప్రసాద్ శర్మ, వీరభద్ర శర్మ, రామాచార్యులు, తేజ శర్మ, చంద్రశేఖర్ శర్మ, తిరుపతిరావు, శివ తదితర పురోహితులు హారతులు సమర్పించారు. సత్యనారాయణ రెడ్డి, మహిళా భక్తులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## భద్రాచలం-చర్ల రహదారి

# పునర్నిర్మాణం చేపట్టాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల బహిష్కరణ కై ప్రజలు ఆలోచించాలి
- గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు రహదారుల సమస్యపై ముందడుగు వేయాలి
- యువతకు, విద్యార్థులకు, స్థానిక ప్రజలకు రావులపల్లి పృథ్వీ పిలుపు







**భద్రాచలం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి ప్రస్తుతం అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామానికి చెందిన రావులపల్లి పృథ్వీ అన్నారు. రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా మార్గాన్ని అందించేందుకు ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.ఈ రహదారి భద్రాచలం-చర్ల ప్రాంత ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైనదని, రహదారి దుస్థితి కారణంగా నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేవలం తాత్కాలిక మరమ్మతులతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని, పూర్తిస్థాయి పునర్నిర్మాణమే మార్గమని పేర్కొన్నారు.భద్రాచలం-చర్ల ప్రాంతానికి చెందిన గ్రాడ్యుయేట్లు, చదువుకున్న యువతతో పాటు ప్రజలు ఈ సమస్యపై ఆలోచించి ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని పృథ్వీ పిలుపునిచ్చారు. రహదారి పునర్నిర్మాణంపై ప్రజా డిమాండ్ ను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందే వరకు ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించే అంశాన్ని ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తక్షణ చర్యలు చేపట్టాలని రావులపల్లి పృథ్వీ డిమాండ్ చేశారు.

# ఈనపల్లి లక్ష్మికి ఘన నివాళి

- దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీటీసీ, మాజీ సొసైటీ చైర్మన్





**బూర్గంపహాడ్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోతేపట్టినగర్ లో బీఆర్ ఎస్ నాయకులు ఈనపల్లి వెంకటేశ్వర్లు, ఈనపల్లి శ్రీను తల్లి ఈనపల్లి లక్ష్మి దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు హాజరై ఈనపల్లి లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాస్ కార్యక్రమానికి హాజరై లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు ఈనపల్లి వెంకటేశ్వర్లు, ఈనపల్లి శ్రీను, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, బీఆర్ ఎస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈనపల్లి లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండలం బిఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ బీఆర్ ఎస్ సారపాక టౌన్ ప్రెసిడెంట్ కొనకంచి శ్రీను, బెజ్జంకి కనకాచారి, చైతన్యరెడ్డి, పంగి సురేష్, పేరాల శ్రీను, తుపాకుల రవి, బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.